క్లుప్తంగా

నేడు కనకదుర్గమ్మ తిరునాళ్ల


అలంకరణలో అమ్మవారు

దొనకొండ: మండలంలోని దొనకొండలో వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ తిరునాళ్లను శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి సుందరంగా అలంకరించారు. తిరునాళ్లకు పరిసర గ్రామాల ప్రజలతో పాటు మొక్కుబడులు ఉన్న భక్తులు విజయవాడ, గుంటూరు, వినుకొండ, మార్కాపురం నుంచి ఏటా తిరునాళ్లకు తరలి వస్తుంటారు. అమ్మవారిని ఆత్మ సాక్షిగా పూజించి కోరికలు కోరితే తప్పక నెరవేరతాయని భక్తుల నమ్మకం. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ టి.త్యాగరాజు తెలిపారు.

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


స్వామి వారి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని ఆవులమంద, పడమరనాయుడుపాలెం గ్రామాల మధ్య వెలసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి సమేత శ్రీ లక్ష్మీబొల్లికొండ్రాయ స్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరుగుతుంది. 12వ శతాబ్దానికి చెందిన పురాతన బొల్లికొండ్రాయస్వామి బ్రహ్మోత్సవాలు హోళీ పౌర్ణమి రోజు ప్రారంభమై ఈ నెల 19వ తేదీ మహా తిరునాళ్లతో ముగుస్తాయి. ఆరు రోజులు స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహిస్తారు. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని దర్శిస్తే సంతానం కలుగుతుందని పేరుంది. దీంతో స్వామి సంతాన వెంకటేశ్వర స్వామిగా ప్రసిద్ధి చెందారు. ఈ ప్రాంతంలో బొల్లి కొండ్రాయస్వామి వారి పేరుతో పిల్లలకు పేర్లు పెట్టుకోవటం నిదర్శనంగా నిలుస్తోంది.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సన్మానం


శ్రీనివాసులును సన్మానిస్తున్న సిబ్బంది

పెద్దదోర్నాల: వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డేను పురస్కరించుకుని మండల పరిధిలోని చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనువాసులును వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 50 మంది గిరిజన గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి వారికి ఐరన్ సిరప్‌లు అందించడంతో పాటు 100 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ గిరిజన గర్భిణులు వైద్యశాలలో అందిస్తున్న సేవలు వినియోగించుకుని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. డాక్టర్ యాగ్నిక్ వైద్య సిబ్బంది పాల్గొని ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులును సత్కరించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ చిరంజీవిని ఘనంగా సత్కరించారు.

ఆలయాల్లో కాంతిలాల్ దండే దంపతుల పూజలు


పూజలు చేస్తున్న కాంతిలాల్ దండే దంపతులు

త్రిపురాంతకం: స్థానిక పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరి దేవి ఆలయాల్లో ఆర్అండ్‌బీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ సెక్రటరీ దంపతులకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ముకుంద హరి, ఆలయాల సూపరింటెండెంట్ రంగరాజు ఉన్నారు.

ఇరుకు రోడ్డులో ఇక్కట్లు తీరేదెన్నడో?


ఒక్క వాహనం ఆగినా అన్నీ ఇలా నిలిచిపోవాల్సిందే..

- దోర్నాల, కర్నూలు రోడ్డులో వాహనదారుల ఇబ్బందులు
- కొండరాళ్లు జారి పడినా.. ఒక్క వాహనం ఆగినా అంతే సంగతులు

రోడ్డు విస్తరిస్తే కష్టాలు తీరే అవకాశం

పెద్దదోర్నాల, కర్నూలు రహదారులు విస్తరణకు సంబంధించి వార్తలు ఎప్పటి నుంచో ఊరిస్తూ వస్తున్నాయి. ఈ రహదారులు ఇరుకుగా ఉండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడెప్పుడా.. అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఒక్కోసారి ట్రాఫిక్ రద్దీతో వాహనాలు గంటల కొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సిన పరిస్థితి. అధికారులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విస్తరణ చేపట్టాలని కోరుకుంటున్నారు.

– షేక్ ఇస్మాయిల్, పెద్దదోర్నాల

పెద్దదోర్నాల: అభివృద్ధికి పట్టుగొమ్మల్లో ప్రధానమైనవి రహదారులు. వాటిని నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయనేది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. మండల పరిధిలోని పెద్దదోర్నాల, కర్నూలు జాతీయ రహదారిలో ఇరుకైన మార్గంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముఖ్యంగా పిల్లల ఘాట్, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లోని రోడ్లు ఇరుకుగా ఉండి నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని అమరావతి, రాయలసీమ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రహదారిని అధికారులు నేషనల్ హైవే 340సిగా గుర్తించినా అటవీ శాఖ అనుమతులు రాక పోవడంతో ఇరుకు మార్గంలోనే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన రహదారుల్లో ఇప్పుడు ట్రాఫిక్ భారీగా పెరిగింది. వాహనాల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ అవే రహదారుపై వాహనాలు ప్రయాణించటం సాధ్యమని వాహనదారులు పేర్కొంటున్నారు. రహదారుల వెడల్పు తక్కువగా ఉండటం, మార్జిన్లు సరిగా లేక పోవటంతో ఒక వాహనం వెళ్లిన తర్వాతే మరో వాహనం వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోడ్డు అంచులు ప్రమాదకరంగా ఉండటంతో ప్రయాణాలు సాగించేందుకు ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న తాండవ రంగారావు

దర్శి: స్వచ్ఛ భారత్ పారిశుధ్య కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ క్లాప్ మిత్రలకు 2020లో ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు చేయాలని కోరుతూ మార్చి 17వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాధర్నా జరుగుతుందన్నారు. కార్మికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులను 2017లో నియమించి మురికి కాల్వలు, వీధులు శుభ్రం చేయడం, గృహాల వద్ద చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించడం, వీధిలైట్ల నుంచి, రోడ్డు పక్కల చిల్లచెట్ల తొలగింపు వరకు వీరే చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో సేవలందిస్తున్న వారికి రూ.6 వేల వేతనం ఇవ్వడం అన్యాయమన్నారు. చవలం గగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ.ఆరు వేలు పనిముట్లకు కూడా సరిపోవడం లేదన్నారు. రక్షణ కవచాలు, బూట్లు, బ్లౌజులు, మాస్కులు, సబ్బులు, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారంలో ఒక రోజు సెలవు దినం ప్రకటించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు, బీమా సౌకర్యం ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఈమని నాగేశ్వరరావు, చలమయ్య, బాల గురవయ్య, అనోక్, ఇస్సాక్, విశ్రాంతమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ


పరీక్ష మెటీరియల్ అందజేస్తున్న మానవత సభ్యులు


లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సభ్యులు..

దర్శి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. మానవత సభ్యుడు సీహెచ్ బసవయ్య, ఎస్ఎన్‌సీహెచ్ సుబ్బారావు, ఆర్.రాఘవులు, సీహెచ్ రోషారావు, ఏ.వెంకటేశ్వర్లు సహకారంతో మెటీరియల్ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, అత్యధిక మార్కులు సాధించుకోవాలంటే ఏం చేయాలనే విషయాలపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. చైర్మన్ దేవతి వరప్రసాద్, కో చైర్మన్ వాకా జనార్దన్‌రెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, డైరెక్టర్‌లు పి. రాజశేఖరరెడ్డి, సుశీలమ్మ, సుబ్బారావు, తిరుపతిరెడ్డి, మస్తాన్ నాయక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో..

ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్లో ఉన్న 20 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు వంటి పరీక్ష మెటీరియల్‌లు పంపిణీ చేశారు. మెటీరియల్‌ను లయన్ బిజ్జం నాగార్జునరెడ్డి అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సభ్యులు సాగర్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


ఎస్.సాంబశివ రావు, ఎంఈఓ


ఎంఈఓలతో ఉపాధ్యాయులు

దొనకొండ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. మండలంలో 11 పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు మొత్తం 567 మంది పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గంగదేవిపల్లి, తెల్లబాడు, ఆరవల్లిపాడు, కేజీబీవీ, విశ్వభారతి, మంగినపూడి, చందవరం, దొనకొండ జెడ్పీ, కొచ్చెర్లకోట, వివేకానంద, సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు దొనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ, బీ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏ సెంటర్‌కు 280 మంది విద్యార్థులు, బీ సెంటర్‌లో 267 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. చీఫ్‌గా జయేంద్రరెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఉమా మహేశ్వరరెడ్డి ఏ సెంటర్‌కు, బీ సెంటర్‌కు చీఫ్‌గా రమణయ్య, డిపార్ట్‌మెంటల్ అధికారిగా గోపాలనాయక్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ వివరించారు. ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో పరీక్షలు పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుతామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎంఈఓ తెలిపారు.

పది పరీక్షలు ముఖ్యం

తాళ్లూరు: విద్యార్థుల భవిష్యత్తుకు పదో తరగతి పరీక్షలు ముఖ్యమని ఎంఈఓ–1 సుబ్బయ్య, ఎంఈఓ–2 సుధాకర్‌రావు అన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గురువారం వారు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 6 సెంటర్లు బీకేపాడు (ఎ), (బి), తూర్పుగంగవరం జెడ్పీ స్కూల్, జాహ్నవి స్కూల్, సరస్వతి హైస్కూల్, వీకేజీహెచ్ఎస్ తాళ్లూరు పాఠశాలల్లో సెంటర్లు కేటాయించారని, 825 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని ఎంఈఓలు వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

గంటవానిపల్లె యువతికి డాక్టరేట్


నందిని (ఫైల్)

పెద్దదోర్నాల: మండల పరిధిలోని గంటవానిపల్లెకు చెందిన యువతి నందినికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విశ్రాంత అధ్యాపకుడు జీవీఎస్ఆర్ ఆంజనేయులు పరిశోధనలో ఆన్ డిఫరెంట్ ఇంఫరెన్సియల్ మెథడ్స్ ఆఫ్ పారామీటర్స్ ఫర్ న్యూ వెయిటెడ్ ఎక్స్‌పోనెన్షియల్ డిస్ట్రిబ్యూషన్‌కు పీహెచ్‌డీని ప్రదానం చేశారు. గతంలో జాతీయ స్థాయిలో నేషనల్ ఫెలోషిప్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్‌తో పాటు పలు అవార్డులు నందిని అందుకున్నారు. డీన్ ఫిజికల్ సైన్సెస్, ఓఎస్‌డీ నాగార్జున, ప్రొఫెసర్ ఆర్‌వీవీఎస్ రవికుమార్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసారావు, ప్రొఫెసర్ సత్యనారాయణతో పాటు గంటవానిపల్లె గ్రామస్తులు తదితరులు నందినికి అభినందనలు తెలిపారు.

కాశీనాయన క్షేత్రంపై ఎందుకీ రాజకీయం?

దర్శి: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కొద్ది రోజులుగా బాబా అవతారం ఎత్తి కాశీనాయన క్షేత్రంపై ఎందుకు రాజకీయాలు చేస్తున్నారని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉచితంగా అన్నం పెట్టే ఆశ్రమాలను కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న బీజేపీ ఈ చర్యపై ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలన్నారు. ఆకలి అన్న లక్షలాది మందికి పట్టెడన్నం పెట్టే కాశీనాయన సత్రం కూల్చడం అన్యాయంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటువంటి చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం

దర్శి: గృహ నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం రూ.50 వేల ఆర్థిక సాయం అదనంగా అందిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.నిరీక్షణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో గృహాలు మంజూరై ఆర్థిక ఇబ్బందులతో పూర్తి చేసుకోలేని వారికి అదనపు ఆర్థిక సాయం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలు తమ పరిధిలోని గృహ నిర్మాణ లబ్ధిదారులను వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వం విడుదల చేస్తున్న అదనపు సబ్సిడీ గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. పూర్తి వివరాలకు లబ్ధిదారులు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు, మండల హౌసింగ్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

సాయిబాబా మందిరంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో దాతల సాయంతో స్వామిని దర్శించుకున్న భక్తులకు, శ్రీశైలం వెళ్లే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

పట్టుదలతో విజయం సాధించాలి


విద్యార్థుల వివరాలు తెలుసుకుంటున్న జీసీడీఓ హేమలత

పెద్దదోర్నాల: పట్టుదలతో అద్భుతమైన విజయాలు సాధించి చదువుకున్న పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని జిల్లా సమగ్ర శిక్షా జీసీడీఓ హేమలత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ అనూష పాల్గొన్నారు.

నైపుణ్యంతే ఉపాధికి మార్గం


సదస్సులో మాట్లాడుతున్న రమణమూర్తి

దర్శి: నైపుణ్యం పెంపొందించుకుని ఉపాధికి మార్గం సుగమం చేసుకోవాలని రాష్ట్ర దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ బి.రమణమూర్తి అన్నారు. గురువారం దర్శి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యువతకు ఉద్యోగ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై జిల్లాస్థాయి అవగాహన సదస్సు నియోజకవర్గ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో యువతీ, యువకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా పరిశ్రమల శాఖల నుంచి యూనిట్లు ఎంచుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రణాళిక ఏర్పాటు చేసుకుని సమయపాలనతో లక్ష్యాలు సాధించుకోవాలన్నారు. కో ఆర్డినేటర్‌లు నాగమణి, డేవిడ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు


సంఘటన స్థలం వద్ద స్థానికులు

దర్శి (ముండ్లమూరు): కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని పులిపాడులో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి కారును పక్కకు తిప్పడంతో అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. కారు తక్కువ వేగంతో ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎప్పుడూ అక్కడ చిన్నారులు తిరుగుతూ ఆడుకుంటుంటారని, ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలోనే అమ్ముకోవాలి


మాట్లాడుతున్న ఏఓ బాలకృష్ణ నాయక్

దర్శి: వరి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలోనే అమ్ముకోవాలని వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని కొర్లమడుగు, పెద్ద ఉయ్యాలవాడ గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ రైతులందరూ వ్యవసాయ శాఖ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. పంటలపై ఆశించే చీడ పీడలు, తెగుళ్ల గురించి తెలియజేశారు. రబీ కాలంలో పొగాకుకు ప్రత్యామ్నాయంగా శనగ వంటి పంటలు సాగు చేయాలన్నారు. వ్యవసాయ సహాయకులు డి.సునీత, సి.మాధురి పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభం


స్కౌట్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

త్రిపురాంతకం: మండలంలోని గణపవరం బాలుర గురుకుల పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఎంఈఓలు ప్రారంభించారు. యూనిట్‌తో విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుందని ఎంఈవోలు తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరరెడ్డి అన్నారు. ఇటువంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్కౌట్స్ శిక్షకులు బి.ఉదయరాజు యూనిఫాం, క్యాప్, స్కార్ఫ్ పంపిణీ చేశారు. మేడపి గురుకులం ప్రిన్సిపాల్ గంటా మోహన్‌రెడ్డి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు సేకరించిన సబ్ కలెక్టర్

త్రిపురాంతకం: అప్పులబాధ తాళలేక పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబ వివరాలను మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ గురువారం సేకరించారు. త్రిపురాంతకానికి చెందిన ఆళ్ల వెంకటేశ్వర్లు 2023 సెప్టెంబర్ 3వ తేదీన పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పద్మతో సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఆత్మహత్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయం కోసం రూ.12 లక్షల అప్పు ఉందని వివరించారు. ప్రభుత్వానికి నివేదిక పంపి రైతు కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ముకుంద హరి, ఏవో నీరజ ఉన్నారు.


రైతు కుటుంబ వివరాలు సేకరిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

చక్కర్లు కొట్టిన విమానం


మండల కేంద్రంపై ఎగురుతున్న విమానం

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో ఓ విమానం గురువారం కొద్దిసేపు చక్కర్లు కొట్టింది. మధ్యాహ్నం సమయంలో మండల కేంద్రం మీదుగా శ్రీశైలం వైపునకు కలియతిరుగూ సంచరించటం ఆసక్తిగా మారింది. నేషనల్ హైవే పనుల కోసం సర్వే జరుగుతోందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేయగా మరి కొందరు ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన సర్వే జరుగుతోందని వాఖ్యానించారు. ఇంకొందరు అది అసలు విమానమే కాదని, డ్రోన్.. అంటూ చర్చించుకున్నారు. మొత్తం మీద దాని సంచారంపై మండలానికి చెందిన పలువురు ఉన్నతాధికారులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కర్లకుంట సుబ్బయ్య సతీమణి నాగేంద్రం అకాల మృతికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కర్లకుంట కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ జాన్‌పాల్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.